
పశు వైద్యశాల స్థలం.. ఆక్రమణలకు నిలయం

- ఇష్టానుసారం సొంత అవసరాల కోసం వాడుకుంటున్న ప్రైవేటు వ్యక్తులు
- వ్యర్థాలు వేస్తూ, పశువులను అక్కడే కట్టేస్తున్న వైనం
- ప్రహరీ లేకపోవడమే కారణమంటున్న పశు వైద్యాధికారులు



ఆక్రమణలకు గురైన రాజుపాలెం ఏరియా పశు వైద్యశాల స్థలం



ఏరియా వైద్యశాల బిల్డింగ్‌కు ఊడిపోయిన పెచ్చులు

రాజుపాలెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా పశు వైద్యశాల స్థలం ఆక్రమణలకు నిలయంగా మారింది. వ్యర్థాలను వేస్తూ బహిర్భూమికి వెళ్లడంతో దుర్వాసనలు వెదజల్లుతున్నాయి. వైద్యశాలకు పది మంది వచ్చిపోతారనే జ్ఞానం కూడా లేకుండా చుట్టు పక్కల ఇళ్ల వారు ప్రవర్తిస్తున్నారు. పశు వైద్యశాల స్థలంను ప్రైవేటు వ్యక్తులు వారి అవసరాల కోసం ఉపయోగించుకుంటున్నారు. పశువులు, గొర్రెలు, మేకలను ఆ స్థలంలోనే కట్టేస్తున్నారు. అధికారులు చెప్పినా వారు పట్టించుకోవడం లేదు.

- మండల కేంద్రంలో పశు వైద్యశాలను 1957లో ఏర్పాటు చేశారు. దీనికి గాను అప్పటి దాత తూను గుంట్ల వెంకటేశ్వర్లు ఎకరం స్థలం విరాళంగా ఇచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏడు దశాబ్దాలు గడిచినా, ఎన్నో ప్రభుత్వాలు మారినా ఇంత వరకు చుట్టూ ప్రహరీ నిర్మించకపోవడంతో దురాక్రమణలు జరుగుతున్నాయని సిబ్బంది వాపోతున్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

మండల కేంద్రం రాజుపాలెంలో ఏడు దశాబ్దాల క్రితం పశు వైద్యశాలను నిర్మించారు. ప్రస్తుతం ఏరియా వైద్యశాలగా మార్చి పశు వైద్యశాల సహాయ సంచాలకుల పోస్టును మంజూరు చేశారు. రాజుపాలెం, బెల్లంకొండ మండలాల్లోని పశు వైద్యశాలలను సహాయ సంచాలకులు (ఏడీ, ఏహెచ్) డాక్టర్ పర్యవేక్షిస్తుంటారు. రాజుపాలెం ఏరియా పశు వైద్యశాలగా మర్చినా డాక్టర్ పోస్టు, అటెండర్ పోస్టు ఇప్పటికీ ఖాళీగానే ఉన్నాయి. మండలంలోని కోటనెమలిపురిలో పశు వైద్యశాలకు డాక్టర్‌ను నియమించకపోవడంతో పశు కాపర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ కాంపౌండర్ వైద్య సేవలందిస్తుంటాడు. ముక్కపాడు, గణపవరం పశు వైద్యశాలల్లో కాంపౌండర్ పోస్టులు ఖాళీగా ఉండంతో డాక్టర్‌లు అవస్థలు పడుతున్నారు. సిబ్బంది కొరత వేధిస్తుందని పశు వైద్యాధికారులు చెబుతున్నారు.

బెల్లంకొండ మండలంలో...

బెలకొండ మండలంలో బెల్లంకొండ, పాపాయపాలెంలో పశు వైద్యశాలలు ఉన్నాయి. పాపాయపాలెం పశు వైద్యశాలలో కాంపౌండర్ పోస్టు, బెల్లంకొండ పశు వైద్యశాలలో డాక్టర్ పోస్టు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు. రెండు మండలాల్లో గేదెలు 20 వేలు, ఆవులు 3 వేలు, గొర్రెలు 38 వేలు, మేకలు 11 వేలు, పందులు 200, కోళ్లఫారాలు 11 ఉన్నాయి.

- రాజుపాలెం పశు వైద్యశాల పడిపోవడానికి సిద్ధంగా ఉంది. చిన్నపాటి వర్షం వచ్చినా కారుతుందని, లోపల పెచ్చులు ఊడిపోయి చువ్వలు బయట పడ్డాయని ఎప్పుడు పడిపోతుందోనని సిబ్బంది భయాందోళన చెందుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం



నూతన భవనం నిర్మించేందుకు, చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. ఆక్రమణదారులు వ్యర్థాలను వేస్తూ ఇస్టానుసారం వాడుతున్నారు. ప్రహరీ లేకపోవడంతో విచ్చలవిడి అయిపోయింది. అయినా చాలా వరకు కంట్రోల్ చేస్తున్నాం. రెండు మండలాల్లో పర్యవేక్షణ చేయడం ఇబ్బందైనా చేస్తున్నాను.

– డాక్టర్ వీరయ్య, సహాయ సంచాలకులు, రాజుపాలెం

క్లుప్తంగా

శ్రీవారికి పౌర్ణమి గరుడ వాహన సేవ



సత్తెనపల్లి: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని పట్టణ రైల్వేస్టేషన్‌రోడ్డులోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో విశేషంగా శ్రావణ మాస శ్రీవారి జన్మ నక్షత్రం శ్రవణా నక్షత్ర శనివారం శ్రీవారికి స్నపన తిరుమంజనం శోభాయమానంగా జరిగింది. శ్రీమాన్ శ్రీ చిత్రకవి శ్యాము ఆచార్య రామానుజస్వామి గరుడాళ్వార్ మండపంలో వేంచేసి ఉన్న గరుడాళ్వార్ మూర్తికి విశేష పూజలు నిర్వహించారు. అంతేకాక జ్ఞానవైరాగ్య ప్రాప్తికి గరుడిని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తకోటి విశ్వాసం. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు గరుడ వాహనంపై పట్టణ రైల్వేస్టేషన్ పుర వీధులలో దర్శనమిస్తూ భక్తులకు అభయప్రదానం చేశారు. ఏకాంత సేవ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గరుడ ముద్ద, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ధర్మకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్రోసూరు మార్కెట్‌యార్డు పాలకవర్గం ఖరారు

క్రోసూరు: పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోని క్రోసూరు వ్యవసాయ మార్కెట్‌యార్డుకు నూతన పాలకవర్గం ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తుర్వులు విడుదల చేసినట్లు మార్కెట్‌యార్డు కార్యదర్శి ఈశ్వరరావు ఆదివారం తెలిపారు. యార్డు చైర్మన్‌గా షేక్ జరీనా(అమరావతి), గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, వైస్ చైర్మన్‌గా రాయిడీ సాంబశివరావు, పాలకవర్గ సభ్యులుగా షేక్‌మస్తాన్ వలి, చల్లా అనుపకళ, మర్రి భూలక్ష్మీ, దుడ్డుల యోహాను, ఎన్.నాగమణి, పత్తికోమలి, మాదాసు అప్పారావు, మందాడి నారాయణ, ఏరువ శౌరీలమ్మ, యడ్లవల్లి కిరణ్మయి, గుమ్మడివల్లి వెంకటేశ్వరరావు, సొంగా కల్యాణి, దుప్పటి బాలకృష్ణతో పాటు క్రోసూరు పీఏసీఎస్ అధ్యక్షుడు, ఏడీఏ క్రోసూరు, క్రోసూరు సర్పంచ్, జిల్లా మార్కెటింగ్ అధికారి సభ్యులుగా ఉంటారని యార్డు కార్యదర్శి తెలియజేశారు.

రోడ్డు పొడవునా గడ్డి కుప్పలు..!




సత్తెనపల్లి: పట్టణంలోని గుంటూరు రోడ్‌లో హోలీ ఫ్యామిలీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల నుంచి ఆర్సీఎం చర్చి వరకు రోడ్డు పక్కన మార్జిన్‌లో ఉన్న గడ్డిని తొలగించారు. కానీ రోజుల తరబడి ఆ గడ్డిని కుప్పలుగా అక్కడే వదిలేసి తొలగించకపోవడంతో అది కాస్త ఎండిపోయి పుట్టలుగా మారుతుంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డు పక్కన గడ్డి కుప్పలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ నాయకుల దాడి


బెల్లంకొండ: గ్రామ దేవతల కొలుపులలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ నాయకులు దాడి చేసి గాయపరిచిన ఘటన మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెం గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఈ దాడిలో గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అన్నపరెడ్డి రామిరెడ్డి, కంకర శివకుమార్ రెడ్డి, పాకాలపాడుకు చెందిన కాల్వపల్లి ప్రభాకర్ రెడ్డికి గాయాలయ్యాయి. గత సార్వత్రిక ఎన్నికల ఫలితాల తరువాత పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు వేరే గ్రామాలలో నివాసం ఉంటున్నారు. కాగా ఆదివారం గ్రామంలో కొలుపుల సందర్భంగా అందరూ ఊళ్లోకి వచ్చారు. వారిపై ఎలాగైనా దాడి చేయాలన్న ఉద్దేశంలో కొందరు టీడీపీ నాయకులు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. రోడ్డుపై వెళ్తున్న కొందరు వైఎస్సార్‌సీపీకి చెందిన వారిని రెచ్చగొట్టి గొడవకు దిగారు. గొడవను సద్దుమణిగించేందుకు వెళ్లిన రామిరెడ్డిపై టీడీపీ నాయకులు దౌర్జన్యానికి దిగి చొక్కా పట్టుకుని నెట్టడంతో చేతికి గాయమైంది. అదే విధంగా కంకర శివకుమార్‌రెడ్డిని, గ్రామానికి బంధువుగా వచ్చిన పాకాలపాడుకు చెందిన కాల్వపల్లి ప్రభాకర్ రెడ్డిని కర్రతో తలపై కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఘటనపై వైఎస్సార్‌సీపీ నాయకులు ఫోన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ముత్యాలమ్మ తల్లికి బోనాలు



దాచేపల్లి : నారాయణపురంలోని ముత్యాలమ్మ తల్లికి ఆదివారం మహిళలు బోనాల సమర్పించారు. విస్తారంగా వర్షాలు కురిసి, పంటలు పండి అందరూ ఆరోగ్యంగా ఉండాలని ప్రార్థించారు. ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణ చేశారు. అనంతరం అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలను అందజేశారు.

వైభవంగా శ్రావణమాస బోనాలు



బెల్లంకొండ: శ్రావణమాసం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం దేవతామూర్తులకు వైభవంగా శ్రావణ మాస బోనాలను భక్తులు సమర్పించారు. మండల కేంద్రమైన బెల్లంకొండలో గ్రామ దేవత ముత్యాలమ్మకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని బుడగజంగాలు అమ్మవారికి బోనాలను సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. బెల్లంకొండ యాదవ కాలనీలో గ్రామస్తులు గ్రామ దేవతలకు జలాభాషేకాలను నిర్వహించి, పొంగళ్లు చేశారు. మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెం గ్రామంలో పోలేరమ్మ తల్లి జాతరను భక్తులు ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లకు జలబిందెలతో ఊరేగింపుగా వెళ్లి జలాభిషేకాలను నిర్వహించారు. పొంగళ్లు చేసి నైవేద్యాలను సమర్పించారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

సెంట్రల్ జీఎస్టీ ఇన్‌స్పెక్టర్ వనమా హర్షసాయి



మాట్లాడుతున్న సెంట్రల్ జీఎస్టీ ఇన్‌స్పెక్టర్ వనమా హర్షసాయి

సత్తెనపల్లి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సెంట్రల్ జీఎస్టీ ఇన్‌స్పెక్టర్ వనమా హర్షసాయి అన్నారు. సత్తెనపల్లిలోని సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న సరస్వతి విద్యాపీఠం విజయవాడ సమితి లెవల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ 2025-26 క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. ముగింపు సభలో వనమా హర్షసాయి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థుల మానసిక ఉల్లాసానికి ఉన్నత స్థాయిలో ఎదగడానికి క్రీడలు దోహద పడతాయన్నారు. విద్యాభారతి రాష్ట్ర కార్యదర్శి జేపీఎస్ శాస్త్రి, విజయవాడ జోన్ కార్యదర్శి కొసనం జగదీష్, పాఠశాల కార్యదర్శి చలువాది చిన సత్యనారాయణ, ప్రధానాచార్యులు మన్నవ ధనలక్ష్మి, శారీరక్ ప్రముఖ్ పెద్దన్న, ఖేల్‌కూద్ ప్రముఖ్ రాములు మాట్లాడారు. ముందుగా మాజీ మున్సిపల్ చైర్మన్ కొల్లిపర కాశీ విశ్వనాథం జ్యోతి ప్రజ్వలనతో సభ ప్రారంభమైంది. ఆటల పోటీల నిర్వహణలో ప్రముఖ పాత్ర వహించిన రిటైర్డ్ పీడీ దాసరి కోటేశ్వరరావు, న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన క్రీడా ఉపాధ్యాయులను సత్కరించి, విజేతలకు మెడల్స్, ధ్రువపత్రాలు బహుకరించారు. సుమారు 300 మందికి పైగా విద్యార్థులు ఈ క్రీడా పోటీలకు హాజరయ్యారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు దేవరశెట్టి రవికుమార్, కమిటీ సభ్యులు కాపుగంటి రత్తయ్య, శరత్‌కుమార్, హరికుమార్, శాంతి, వివిధ పాఠశాలల ఆచార్యులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త మృతి



మరియరాణి (పాతచిత్రం)

పెదకూరపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడి.. 10 నెలలు పాటు మృత్యువుతో పొరాడి చివరకు తుది శ్వాస విడిచిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని పాటిబండ్ల గ్రామంలోని అంగన్‌వాడీ-1 సెంటర్‌లో 25 సంవత్సరాలుగా అంగన్‌వాడీ కార్యకర్తగా సేవలందించిన తుమ్మా మరియరాణి(58) ఆదివారం మృతి చెందింది. గత ఏడాది నవంబర్ 13వ తేదీన తమ బంధువు ఇంటిలో శుభకార్యానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా సత్తెనపల్లి హోలీ ఫ్యామిలి వద్ద ఆమె ప్రమాదానికి గురైంది. వెంటనే స్థానిక ప్రైవేట్ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అందించారు. తలకు బలమైన గాయం కావడంతో గుంటూరు ప్రైవేట్ వైద్యశాలలో బ్రెయిన్‌కు శస్త్ర చికిత్స చేశారు. ఫలితం లేకపోవడంతో 40 రోజుల తరువాత హైదరాబాద్ తరలించారు. అప్పటి నుంచి మృత్యువుతో పోరాడుతూ చివరికి ఆదివారం తెల్లవారుజామున ఆమె తుదిశ్వాస విడిచింది. ఆమె భర్త యుక్త వయస్సులో మరణించినా.. కష్టపడి అంగన్‌వాడీ కార్యకర్తగా కొలువు తెచ్చుకొని.. తన బిడ్డలను ఉన్నత స్థితికి చేర్చిందని, యూనియన్‌లో కూడా యాక్టివ్‌గా పాల్గొనేవారని అంగన్‌వాడీ కార్యకర్తలు చెబుతున్నారు. యూనియన్ నాయకులు కొల్లి లక్ష్మీనరసమ్మ, చెరుకూరి సామ్రాజ్యం , గోగులపాటి కుమారి, శాంతకుమారి, సుబ్బమ్మ శ్రావణి, బీబీ సామ్రాజ్యం, సూపర్‌వైజర్ మున్ని, హిమాంబీలు నివాళులర్పించారు.

అసలే ఇరుకు ... ఆపై ట్రాఫిక్..!






నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో ప్రధాన రహదారి ఇరుకుగా ఉండటంతో ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. ఈ రహదారిలోనే బంగారం, జనరల్ స్టోర్స్, బ్యాంక్, దుస్తుల దుకాణాలు, శివాలయం, వైద్యశాల, హోటల్స్‌లు ఉన్నాయి. ఈ రోడ్డులోనే పోలీసుస్టేషన్, ప్రైవేట్ పాఠశాలలు, తహసీల్దార్, ఎంపీడీవో, సబ్-ట్రెజరీ, రిజిస్ట్రేర్, వ్యవసాయ శాఖ, గృహనిర్మాణ శాఖ, గ్రామ సచివాలయం, ఐకేపీ కార్యాలయాలు ఉన్నాయి. దీంతో నిత్యం మండలంలోని 20 గ్రామాల ప్రజలు వివిధ అవసరాలకు రాకపోకలు సాగిస్తుంటారు. అసలే ఇరుకుగా ఉన్న ఈ రోడ్డుపై దుకాణదారులు సామగ్రి ఎగుమతులు, దిగుమతులకు సమయపాలన లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు చేయడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పలు గ్రామాలకు వెళ్లేందుకు ఈ రహదారిలోనే ఆర్టీసీ బస్సులు వెళ్తుంటాయి. ఒక పక్క స్కూలు బస్సులు, కనీసం ఆటో, ద్విచక్ర వాహనం వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు. ఎగుమతులు, దిగుమతులకు ఒక సమయం కేటాయించాలని, రోడ్డు పక్కన ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేయకుండా చూడాలని, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని స్థానికులు వేడుకుంటున్నారు.

– పెదకూరపాడు

కారులో మంటలు

సకాలంలో అదుపు చేసిన ఫైర్ సిబ్బంది



చిలకలూరిపేట: నిత్యం రద్దీగా ఉండే చిలకలూరిపేట ప్రధాన రహదారిలో ఒక కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. అయితే, ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే.. చిలకలూరిపేట పట్టణంలోని సీఆర్ కాలనీ నుంచి ఎన్ఆర్‌టీ సెంటర్‌కు వెళ్తున్న ఏపీ 39 కేడబ్ల్యూ 1912 నంబరు గల కారు మున్సిపల్ కార్యాలయం దగ్గరకు రాగానే, ఇంజిన్ నుంచి పొగలు రావడం మొదలైంది. ఇది గమనించిన డ్రైవర్ అప్రమత్తమై వెంటనే కారు దిగి పక్కకు వెళ్లిపోయాడు. పొగలు చూసిన స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైర్ స్టేషన్ అదే రోడ్డులో ఉండటంతో, అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. అయితే, వారు వచ్చేలోపు కారులోంచి మంటలు ఒక్కసారిగా ఎగిసిపడ్డాయి. సిబ్బంది అరగంటకు పైగా కష్టపడి మంటలను అదుపులోకి తెచ్చారు. కానీ అప్పటికే కారు ముందు ఇంజిన్ భాగం పూర్తిగా కాలి ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో ప్రజలకు గానీ, సమీపంలోని దుకాణాలకు గానీ ఎటువంటి నష్టం జరగకపోవడంతో స్థానికులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

పిల్లి పిల్లకు తల్లిగా మారిన శునకం



పీసపాడు(క్రోసూరు): మానవత్వం కొరవడుతున్న ప్రస్తుత సమాజంలో చిన్న చిన్న విషయాలకే ప్రాణాలు తీసుకుంటున్న సంఘటనలు కోకొల్లలు. అయితే మానవులకు మానవత్వం తెలిసొచ్చే విధంగా జంతువులు ఎన్నో విధాలుగా ప్రేమ, త్యాగాలు చూపించి హృదయాల్ని కదలించి వేస్తున్నాయి. అటువంటి సంఘటన మండలంలోని పీసపాడు గ్రామంలో విప్పల ఆదిరెడ్డి ఇంటిలో జరిగింది. తల్లిలేని పిల్లి పిల్లకు కుక్క పాలు ఇస్తూ మానవ సమాజానికి విలువలు నేర్పుతుంది. తన తల్లి ఊహే తెలియని పిల్లి పిల్లకు కుక్క తల్లిగా మారి పాలు ఇస్తుండటంతో చూపరుల హృదయాలు కరిగించి వేస్తుంది.

ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాలి

కారెంపూడి: కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదులమూడి హరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. అధికారంలోకి వచ్చాక రూ.25 వేల జీతంతో పాటు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపచేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. దీనికి ఆశపడి తామంతా కూటమికి ఓట్లు వేశామని, అధికారంలోకి వచ్చి 14 నెలలయినా అమలు పర్చలేదని పేర్కొన్నారు. సర్వీస్ రూల్స్ లేకపోవడం వల్ల కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు నష్టపోతున్నారని, మృతి చెందితే వారి కుటుంబానికి కనీస భరోసా కల్పించడం లేదని తెలిపారు. తమకు కూడా రిటైర్‌మెంట్ వయస్సును 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని విజ్ఞప్తి చేశారు.

రక్తదానం సామాజిక బాధ్యత

శావల్యాపురం: రక్తదానం చేయటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని రెడ్ క్రాస్ గుంటి ఆంజనేయ స్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ చిలంకూరి కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని కనమర్లపూడి గ్రామంలో గ్రామ పెద్ద ముక్కపాటి నాగేశ్వరరావు సారథ్యంలో నరసరావుపేట రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ముక్కపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ రక్తదానం చేసి ఇతరుల ప్రాణాలను సకాలంలో కాపాడటం కూడా పౌరులుగా బాధ్యతగా స్వీకరించాలన్నారు. ప్రాణానికి మూలం రక్తమని, ఆపత్కాలంలో రక్తదానం చేయటం మంచి సేవా అన్నారు. నేటి యువత రక్తదానం ఆవశ్యకతపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అనంతరం రక్తదానం చేసిన యువకులను అభినందించి, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు పొత్తూరి రాము, బెల్లకొండ ప్రసాదు, వెంకటేశ్వర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధుడి మృతదేహానికి అంత్యక్రియలు



వినుకొండ: మానవ సేవా సమితి ఆధ్వర్యంలో అనాథ వృద్ధుడి మృతదేహానికి ఆదివారం అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు మాట్లాడుతూ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గుర్తుతెలియని వృద్ధుడు గత రెండు రోజుల క్రితం మృతి చెందాడని, సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి మార్చురీలో ఉంచి అతని ఆచూకీ కోసం ప్రయత్నించారని తెలిపారు. మృతునికి సంబంధించిన ఆచూకీ లభించపోవడంతో మానవసేవా సమితి సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పి.వి.సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి చామర్తి భవానిశంకర్, సభ్యులు అంజి, మస్తాన్‌వలి, జాబీర్, సర్కార్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో మరలా చోరీ



దొంగలు ఇంటిలో బీరువా పగలగొట్టిన దృశ్యం

అమరావతి: ఇంటికి తాళాలు వేసి ఎంత అర్జంటు పని ఉన్నా అమరావతి గ్రామస్తులు ఊరికి వెళ్లటానికి భయపడుతున్నారు. గత గురువారం రాత్రి మండల కేంద్రమైన అమరావతిలో ఒకచోట చోరీకి విఫలయత్నం చేసిన దొంగను సీసీ ఫుటేజిలో గుర్తించారు. మరో చోట కొద్దిపాటి వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. కొద్దిపాటి వెండి వస్తువులే కదా అని పోలీసులు కేసు నమోదు చేయకుండా లైట్ తీసుకున్నారు. ఈ క్రమంలో మరలా శనివారం రాత్రి మరో చోరీ జరగటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్ సమీపంలో బందా వెంకటకృష్ణారావు దంపతులు వారం రోజుల క్రితం బెంగళూరులోని తమ కుమారుడు ఇంటికి వెళుతూ ఇంటి ముందు ముగ్గు వేయటానికి గేటు తాళాలను ఎప్పటిలానే పక్కింటి వారికి ఇచ్చి వెళ్లారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ముగ్గు వేయటానికి గేటు తీసిన పక్కింటి వారు ఇంటి తాళాలు తీసి ఉండటంతో వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఇంటిలోని బీరువా తాళాలు పగలగొట్టి అందులోని దుస్తులు చిందరవందరగా పడవేసి ఉండటాన్ని గుర్తించారు. ఇంటి యజమానితో ఫోన్‌లో మాట్లాడి ప్రాథమిక విచారణ చేయగా కొన్ని వెండి వస్తువులు చోరీకి గురైనట్లుగా గుర్తించారు. ఇంటి యజమానులు బెంగళూరు నుంచి వస్తే గాని ఏమేమి చోరీకి గురయ్యాయో తెలియదు. ఈ ఘటనపై అమరావతి పోలీసులు క్లూస్‌టీం ద్వారా ఆధారాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేదాలు హైందవ జీవన విధానానికి ప్రతీకలు

గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ యశస్వి రమణ



వేద పాఠశాల నిర్వాహకులు ఘంటసాల చంద్రమౌళిని సత్కరిస్తున్న దృశ్యం

అమరావతి: ఆదిగురువు వేదవ్యాసుల నుంచి మనకు సంక్రమించిన వేదాలు, ఉపనిషత్‌లు భారతీయ హైందవ జీవన విధానానికి ప్రతీకలని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ యశస్వి రమణ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక సరస్వతి శిశు విద్యా మందిర్‌లో నిర్వహించిన వేద సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సరస్వతి శిశుమందిర్ ప్రధానోపాధ్యాయుడు కోలా వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా యశస్వి రమణ మాట్లాడుతూ వేదం భారతీయుల జీవన విధానంలో నిబిడీకృతమైందన్నారు. ఈ వేద సభలో ధాన్యకటక బుద్ధ విహార ట్రస్టు చైర్మన్ డాక్టర్ వావిలాల సుబ్బారావు మాట్లాడుతూ వేద విద్య మనుగడ సాగించినంతకాలం మానవజాతి సుభిక్షంగా ఉంటుందన్నారు. ప్రస్తుత కాలంలో వేదసారాన్ని అందరికీ అర్థమయ్యే రీతిలో చెప్పాల్సిన అవసరముందన్నారు. ఈ సందర్భంగా అమరావతి శ్రీగీత వెంకటేశ్వర వేద పాఠశాల నిర్వాహకులు ఘంటసాల చంద్రమౌళి, వేద పాఠశాల గురువులు మణికంఠ, కౌశిక కశ్యప శర్మ వేద పారాయణం చేశారు. అనంతరం అమరావతి వేద పాఠశాల నిర్వాహకులు, గురువులు, విద్యార్థులను వనమా పూర్ణ చంద్రరావు, విద్యా భారతి ఆంధ్ర ప్రదేశ్ సంఘటన కార్యదర్శి కన్నా భాస్కర్, తుమ్మలపల్లి చంద్ర భాస్కర్‌రావు, వనమా నరేంద్రలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు పులిపాటి పవన్‌కుమార్, కౌశిక ప్రసాద్, వారణాసి వెంకటేశ్వర శర్మ, శంకరమంచి శ్రీనివాస్, గొల్లమూడి సుధీర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మలుపు.. పక్కనే తూము



88త్యాళ్లూరు.. గుడిపాడు రహదారిలో మలుపు పక్కనే ఉన్న తూము

మండలంలోని 88త్యాళ్లూరు నుంచి గుడిపాడు గ్రామానికి వెళ్లే ఆర్ అండ్ బీ రహదారి మలుపు చాలా ప్రమాదకరంగా ఉంది. మలుపు వద్దే కాలువ నీళ్లు ఈ పక్క నుంచి ఆ పక్కకు పారేందుకు తూము, దాని వెంట కాలువ ఉండటం ప్రమాదకరంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. ఎవరైనా రాత్రి సమయాల్లో తెలియక(చూసుకోకుండా) పొరపాటున మలుపు వద్ద ద్విచక్ర వాహనదారులు రోడ్డు దిగారంటే కాలువలో పడటం ఖాయమని స్థానికులు అంటున్నారు. తూము ఏర్పాటు చేసుకున్న రైతులు లేదా ఆర్ అండ్ బీ అధికారులు మలుపు వద్ద రోడ్డు పక్కనే హెచ్చరిక రాళ్లు పెట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

– 88త్యాళ్లూరు(క్రోసూరు)